క్లుప్తంగా

ప్రైవేట్ పాఠశాలల అధ్యక్షుడిగా వెంకటస్వామి


నూతన కమిటీ సభ్యులు

ఇల్లెందు: ప్రైవేట్ పాఠశాలల డివిజన్ అధ్యక్షుడిగా జవహర్ స్కూల్ కరస్పాండెంట్ కె.వెంకటస్వామి ఎన్నికయ్యారు. శనివారం ఇల్లెందులోని జవహర్ స్కూల్‌లో జరిగిన సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా ప్రియదర్శిని హైస్కూల్ కరస్పాండెంట్ వి.మహేందర్, కోశాధికారిగా మాస్టర్ మైండ్స్ హైస్కూల్ కరస్పాండెంట్ జక్కుల సర్వేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా ఎంఆర్‌జీ నారాయణ కరస్పాండెంట్ ఒంగూరి శ్రీనివాస్, సహాయ కార్యదర్శిగా గుండాల ప్రగతి స్కూల్ కరస్పాండెంట్ తాటిపల్లి సత్యం ఎన్నికయ్యారు.

రైతు వ్యతిరేక విధానాలపై పోరాడుదాం..

ఇల్లెందు: కేంద్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక చట్టాలను పూర్తిగా రద్దు చేయాలని, ఈ మేరకు రైతులకు స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ అఖిలపక్ష రాజకీయ పార్టీలు సమావేశమయ్యాయి. శనివారం ఇల్లెందులోని ప్రజాపంథా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సీపీఐ, సీపీఎం, ఎన్డీ, ప్రజాపంథా, అనుబంధ రైతు సంఘాల నేతలు సమావేశమై ఈ నెల 21న సదస్సు నిర్వహించాలని, వచ్చే నెల 3న నిరసన చేపట్టాలని తీర్మానించాయి. సమావేశంలో బంధం నాగయ్య, ఎస్‌ఏ నబీ, బుర్ర వెంకన్న, ఊక్లా పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యాలను సాధించాలి



మాట్లాడుతున్న సంజీవరావు

పాల్వంచ: మైనార్టీ గురుకులాలు, పాఠశాలల్లోని విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు సాధించేందుకు కృషి చేయాలని జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి సంజీవరావు అన్నారు. శనివారం స్థానిక నవభారత్ శేఖరం బంజరలోని కొత్తగూడెం బాలుర మైనార్టీ గురుకుల, పాఠశాలలో జిల్లా స్థాయి స్పార్క్ ఫెస్ట్‌ను ఘనంగా నిర్వహించారు. సంజీవరావు మాట్లాడుతూ.. ఈప్రోగ్రామ్ ముఖ్య ఉద్దేశ్యం విద్యార్థుల సృజనాత్మక రచన, సమగ్రాభివృద్ధి దోహదం చేసే వివిధ పోటీలను నిర్వహించడం అన్నారు. జిల్లా స్థాయి విజేతలను రాష్ట్రస్థాయి పోటీలకు పంపించడం జరుగుతుందన్నారు. విద్యతో పాటు, వివిధ అంశాల్లో విద్యార్థులు రాణించాలన్నారు.

ఏడేళ్లుగా కాలయాపన


ముర్రేడు వాగు వద్ద ధర్నా చేస్తున్న స్థానికులు

కొత్తగూడెంరూరల్: జాతీయ రహదారుల శాఖ అధికారులు, కాంట్రాక్ట నిర్లక్ష్యం కారణంగా లక్ష్మీదేవిపల్లి మండలంలోని ముర్రేడు వాగు బ్రిడ్జి అప్రోచ్ పనులు నిలిచిపోయాయని స్థానిక ప్రజాప్రతినిధులు శనివారం ధర్నా నిర్వహించారు. శ్రీనగర్ కాలనీ ఉప సర్పంచ్ లగడపాటి రమేష్‌చంద్, ఉర్దూఘర్ చైర్మన్ అన్వర్‌పాషా, వట్టికొండ సాంబశివరావు మాట్లాడుతూ... ముర్రేడు వాగుపై రెండో బ్రిడ్జి నిర్మాణ పనులు ఏడేళ్లుగా నత్త నడకన సాగుతున్నాయని దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న సంబంధిత కాంట్రాక్టర్ వచ్చి రేపటి నుంచి పనులు ప్రారంభిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

సమష్టిగా ప్రజారోగ్యానికి శ్రమిద్దాం..

ఇల్లెందురూరల్: పల్లెల్లో ప్రజల ఆరోగ్యం మెరుగుపర్చేందుకు గ్రామపంచాయతీలు, వైద్య శాఖ సమన్వయంతో పనిచేయాలని రొంపేడు పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ కవిత అన్నారు. ఆస్పత్రి ఆవరణలో శనివారం పంచాయతీ, వైద్య అధికారులతో సమావేశం నిర్వహించారు. మాట్లాడుతూ.. పల్లెల్లో పారిశుద్ధ్యం మెరుగుపర్చడంతోపాటు దోమల ఉత్పత్తి ప్రాంతాలను గుర్తించి నివారణ మందులు చల్లించాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ బాలరాజు, సర్పంచ్‌లు సూర్నపాక రామయ్య, శంకర్, డాక్టర్ మురళీకృష్ణ పాల్గొన్నారు.

వైద్యశిబిరానికి స్పందన

పాల్వంచరూరల్: తోగ్గూడెం గ్రామంలో శనివారం సోషల్ హెల్త్ కేర్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత హెల్త్ క్యాంప్ నిర్వహించారు. డాక్టర్ శ్రీకాంత్, నర్సింహారావు 150మందికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. శిబిరంలో సంస్థ జిల్లా ఇన్‌చార్జ్ భారతి, నిర్వాహకులు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


పాల్వంచరూరల్: విగ్రహాలు కొనుగోలు చేస్తున్న భక్తులు,


పూజా సామగ్రి కొనుగోలు చేస్తున్న మహిళలు


కొత్తగూడెంటౌన్: వనందాస్‌గడ్డలో..

గణేష్ మండపాలు ముస్తాబు

- రేపటి నుంచి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం
- కొలువుదీరనున్న బొజ్జ గణపయ్య
- వీధివీధినా వెలసిన మండపాలు

కొత్తగూడెంటౌన్: ఈ నెల 18వ తేదీ నుంచి గణేష్ నవరాత్రి మహోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు భక్తులు మండపాలను ముస్తాబు చేశారు. ఆలయాల్లో, వీధుల్లో ఏర్పాటు చేసిన మండపాల్లో కొలువుదీరనున్న బొజ్జ గణపయ్యకు మండపాలను సిద్ధం చేస్తూ భక్తుల హడావుడి నెలకొంది. జిల్లా కేంద్రంలోని కొత్తగూడెంలోని పలుచోట్ల మండపాలను కమిటీ ఆయా సభ్యులు ఏర్పాటు చేస్తున్నారు. కొత్తగూడెం చిన్నబజార్, పెద్దబజార్, సూపర్‌బజార్, త్రీటౌన్ సెంటర్, బస్టాండ్ సెంటర్, పోస్టాఫీస్ సెంటర్, రైటర్‌బస్తీ, హనుమాన్ బస్తీ, బాబుక్యాంప్, పాత కొత్తగూడెం, రామవరం, వనందాస్‌గడ్డ బస్తీ, రుద్రంపూర్, గౌతంపూర్‌లతో పాటు పలు ప్రాంతాల్లో భక్తులు వినాయకుడి మండపాలల్లో ప్రత్యేక పూజలు చేసేందుకు గణేష్ మండపాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ఎక్కడ చూసినా నవరాత్రుల శోభ సంతరించుకుంది.

సుజాతనగర్: వినాయకచవితి పర్వదినం సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాల్లో గణేష్ ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో మండపాలను ఏర్పాటు చేసి విద్యుత్ దీపాలతో అలంకరిస్తున్నారు. సోమవారం వినాయకచవితి కాగా గ్రామాల్లో కూడళ్లన్నీ ఇప్పటికే సందడిగా మారాయి.


సుజాతనగర్‌లో ఏర్పాటు చేసిన మండపం

సండే స్పెషల్

ప్రజలు వినాయక ప్రతిమలు, పూజా సామగ్రి కొనుగోలు చేస్తున్నారు. మండల కేంద్రంలోని ప్రధాన సెంటర్ రద్దీగా మారింది. పూజా సామగ్రితో పాటు పూలు, పండ్ల ధరలు భారీగా పెరిగాయని భక్తులు చెబుతున్నారు.

పెరిగిన ధరలు..

పాల్వంచరూరల్: వినాయక చవితి పూజలు ఘనంగా జరుపుకోవాలని ఆశించిన ప్రజలను ఆకాశాన్నంటిన వివిధ రకాల పూలు, పండ్లు, పూజా సామగ్రి ధరలు భయపెడుతున్నాయి. గతేడాదితో పోలిస్తే అన్ని వస్తువుల ధరలు వీపరీతంగా పెరిగాయి. మార్కెట్‌లో ధరలను చూసి భక్తులు వామ్మో.. అంటున్నారు. వినాయకుని పూజా కార్యక్రమానికి పూలు, పండ్లు ప్రత్యేకం. ఇదే అదునుగా భావించిన వ్యాపారులు ధరలను రెట్టింపు చేసి అమ్ముతున్నారు. విఘ్నేశ్వరుడి పూజలో తమలపాకులు, కొబ్బరికాయలు, పసుపు, కుంకుమ, గంధం, ఆవు నెయ్యి తదితరములు తప్పనిసరి. ప్రస్తుతం వీటిధరలు కొండెక్కాయి. డజన్ చామంతి పూలు రూ.200 – 250, బంతిపూలు కేజీ రూ.350 – 400, గులాబీలు డజన్ రూ.250, అరటిపండ్లు డజన్ రూ.50 – రూ.60. ఇక యాపిల్, దానిమ్మ ఒక్కోటి రూ.25 – 30 చొప్పున విక్రయిస్తున్నారు. వినాయకుని విగ్రహాలు పెద్దవి రూ.15వేల – 40వేల వరకు, చిన్న విగ్రహాలు రూ.500 పైన మార్కెట్‌లో అమ్ముతున్నారు.

ఉత్సవ కమిటీలు జాగ్రత్తలు పాటించాలి

కొత్తగూడెంఅర్బన్: వినాయక చవితి సందర్భంగా మండపాలు ఏర్పాటు చేస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు ముందుగా విద్యుత్‌శాఖ ఏఈల నుంచి లోడ్‌కి అనుగుణంగా విద్యుత్ సౌకర్యం కోసం అనుమతి తీసుకోవాలని తెలంగాణ పవర్ డిస్ట్రిబ్యూషన్ డివిజనల్ ఇంజనీర్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. ప్రతి మండపంలో నాణ్యమైన విద్యుత్ వైర్లు, స్విచ్‌లు వాడలని తెలిపారు. మండపాల దగ్గర స్విచ్ బోర్డులు ఏడు అడుగుల కంటే ఎక్కువ ఎత్తులో ఉండేలా చూసుకోవాలని, విద్యుత్ వైర్లకు ఎటువంటి జాయింట్లు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

మున్సిపల్ ప్రతిష్ట పెంచుదాం..

ఇల్లెందు: మూడు అవార్డులు గెలుచుకుని రాష్ట్రస్థాయిలో తలెత్తుకుని నిలబడిన మున్సిపాల్టీ ప్రతిష్టకు భంగం కలగకుండా అభివృద్ధికి పాటుపడదామని, ఆత్మ పరిశీలన చేసుకుని ముందుకెళ్లాలని చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు అధికారులు, కౌన్సిలర్లకు హితవు పలికారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ పాలకవర్గం అధికారం చేపట్టిన తర్వాత ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలు చేపట్టామని తెలిపారు. 2016–17లో మంజూరైన నిధులతో పనులు చేపట్టి పూర్తి చేస్తున్నామని చెప్పారు. దురదృష్టవశాత్తు గత ఏడాదిగా జరుగుతున్న పరిణామాలు బాధ కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. ఇంటి గుట్టు రచ్చకెక్కకుండా చూసుకోవాల్సిన సభ్యులు ఆ దిశగా ప్రవర్తించకపోవటం వల్ల అప్రతిష్ట వచ్చిందన్నారు. ఇప్పటి వరకు వ్యక్తిగతంగా ఏ సభ్యుని పట్ల తాను అమర్యాదగా ప్రవర్తించలేదన్నారు. రూ.25 కోట్ల నిధులు ఉన్నా ఇప్పటికీ ఆరుసార్లు టెండర్లు జరిగినా ఏ కాంట్రాక్టర్ ముందుకు రాకపోవటం శోచనీయమన్నారు. ఎవరికి వారే తమ వ్యవహార శైలిని విశ్లేషించుకుని నడచుకోవాలని సూచించారు. తాను ఏనాడూ ఏ అధికారినీ ఇబ్బంది పెట్టలేదన్నారు. కొందరు అదును చూసి దెబ్బ కొడుతుండడం వల్ల కొంత నష్టం వాటిల్లిందన్నారు. పాలన గాడిలో పడేందుకు అంతా కలిసి పని చేయాల్సి ఉందని ఆ దిశగా తాను ఒక అడుగు కిందికి దిగి స్నేహహస్తం అందిస్తున్నట్లు తెలిపారు.


మాట్లాడుతున్న చైర్మన్ డీవీ

మట్టి ప్రతిమలను పూజించండి..

వినాయక పర్వదినం సందర్భంగా అందరూ మట్టి ప్రతిమలు మాత్రమే ఉపయోగించాలని, పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని కోరారు. ప్రభుత్వం ఇల్లెందు నియోజకవర్గానికి వెయ్యి మట్టి విగ్రహాలను అందజేస్తోందన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కమిషనర్ టి.నవీన్ తదితరులు ఉన్నారు.

ఖాళీ పోస్టులు భర్తీ చేయండి


జేసీకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

టేకులపల్లి: రాష్ట్రంలో వివిధ విద్యా సంస్థల్లో, కాలేజీల్లో, యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న పోస్టులను తక్షణమే భర్తీచేయాలని, మెగా డీఎస్సీని, ఏజెన్సీ ప్రత్యేక డీఎస్సీని ప్రకటించాలని ప్రగతిశీల యువ జన సంఘం(పీవైఎల్) రాష్ట్ర అధ్యక్షుడు మోకాళ్ల రమేష్, రాష్ట్ర సహాయ కార్యదర్శి నోముల భానుచందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో జేసీకి వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. తూతూ మంత్రంగా నిరుద్యోగ యువతను నమ్మించే నియామకాలతో ఉపయోగం లేదన్నారు. సీఎం కేసీఆర్ ఇచ్చిన ఉద్యోగాల భర్తీ హామీని విస్మరించారన్నారు. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం జరిగిన పోరాటంలో వందల మంది తమ ప్రాణాలను అర్పించి రాష్ట్రాన్ని సాధించారని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగాలను భర్తీ చేస్తామని హామీ ఇచ్చి యువతను మోసం చేస్తోందని, రాష్ట్రంలో 1.30 లక్షలకు పైగా ఉద్యోగాలు ఖాళీగా ఉంటే వాటని భర్తీ చేయకుండా కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ తదితర పేర్లతో వెట్టి చాకిరీ చేయించుకుంటున్నారని విమర్శించారు. కార్యక్రమంలో భూక్యా లక్ష్మణ్, కిషన్, సత్యం, ప్రణయ్, విజయ్, కళ్యాణి, విజయ పాల్గొన్నారు.

అమరుల స్ఫూర్తితో ముందుకు సాగుదాం..

సింగరేణి(కొత్తగూడెం): తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమరుల స్ఫూర్తితో నేటితరం కమ్యూనిస్ట్ నాయకులు, కార్యకర్తలు ముందుకు సాగాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషా పిలుపునిచ్చారు. సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా చుంచుపల్లి మండలం, రుద్రంపూర్, గౌతంపూర్, సింగరేణి కార్మిక ప్రాంతాల్లోని తెలంగాణ పోరాట యోధులు, ఈ ప్రాంత అమరవీరులు దేవూరి శేషగిరిరావు, టీబీ విఠల్‌రావు, మను బోతుల కొమురయ్య విగ్రహాల వద్ద పార్టీ జెండాలను ఆవిష్కరించారు. పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాషా మాట్లాడుతూ.. భూమి.. భుక్తి.. వెట్టిచాకిరీ విముక్తి కోసం జరిగిన వీరోచిత పోరాటంలో నాలుగు వేల మంది కమ్యూనిస్టులు రక్తాతర్పణం చేశారన్నారు. వారి పోరాటాలు, ప్రాణత్యాగాలతోనే తెలంగాణ ప్రజలకు విముక్తి లభించిందని, తెలంగాణ ప్రాంతం విశాల భారతంలో విలీనమైందన్నారు. కమ్యూనిస్టు నాయకత్వంలో సుదీర్ఘంగా జరిగిన సాయుధ పోరాటంలో పది లక్షల ఎకరాల భూమిని పేదలకు పంపిణీ చేసినట్లు చెప్పారు. ఆనాటి నుంచి నేటి వరకు కమ్యూనిస్టులు.. కార్మికులు, కర్షకులు, పీడిత ప్రజల విముక్తి కోసం నిరంతరం పోరాటం సాగిస్తున్నారన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ తెలంగాణ సాయుధ పోరాటానికి ఎలాంటి సంబంధం లేకుండానే సాయుధ పోరాటంలో మాపాత్ర ఉందని చెప్పుకోవటం సిగ్గు చేటన్నారు. కార్యక్రమంలో దమ్మాలపాటి శేషయ్య, వై శ్రీనివాస్‌రెడ్డి, వాసిరెడ్డి మురళి, మల్లికార్జున్‌రావు పాల్గొన్నారు.


అమరవీరుల విగ్రహాల వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

ట్రాక్టర్ డ్రైవర్ల కమిటీ ఎన్నిక

ఇల్లెందు: ఇల్లెందు ఏరియా ట్రాక్టర్ ఓనర్స్ యూనియన్ (ఇఫ్టూ) నూతన కమిటీని ఎన్నుకున్నారు. శనివారం ఇల్లెందులోని ఇఫ్టూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో తెలంగాణ ప్రగతిశీల ఆటో మోటార్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాయం వెంకన్న ఆధ్వర్యంలో సమావేశమై సంఘం బలోపేతం కోసం కృషి చేయాలని తీర్మానించారు. గౌరవ అధ్యక్షుడిగా వచ్చా కృష్ణమూర్తి, అధ్యక్షుడిగా శీలం వెంకన్న, ప్రధాన కార్యదర్శిగా తాటి వెంకన్న, సహాయ కార్యదర్శి వీరబోయిన అంజి, కోశాధికారి సంతపురి వెంకటేశ్వర్లు, ప్రచార కార్యదర్శి ఇబ్రహీం, ఆర్గనైజింగ్ సెక్రెటరీ గుమ్మడి రామస్వామితో పాటు 9 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

గిరిజన ఉపాధ్యాయుల నిరసన

జూలూరుపాడు: గిరిజన ఉపాధ్యాయులకు ప్రమోషన్లు కల్పించాలని టీఎస్‌టీటీఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు మాలోత్ లక్ష్మణ్ నాయక్, హలావత్ నరసింహారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం రాచబండ్ల కోయగూడెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జిలు ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో అజ్మీర నరేష్, బోడా వెంకటేశ్వర్లు, భూక్యా భావ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

తాళాలు పగలగొట్టి గుడ్లు పంపిణీ

పాల్వంచరూరల్: అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు అంగన్‌వాడీ కేంద్రాలకు తాళాలు వేసి అప్పగించకుండా సమ్మె చేయడంతో ఆరురోజులుగా అంగన్‌వాడీ కేంద్రాలు మూతపడ్డాయి. దీంతో మండలంలోని కిన్నెరసాని, రాజాపురం, పుల్లాయిగూడెం, కొరగట్టు, పునుకుల గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల తాళాలను శనివారం పగలగొట్టి తెరిచినట్లు సీడీపీఓ కనక దుర్గ తెలిపారు. ఆయా కేంద్రాల్లో నిల్వ ఉన్న గుడ్లను కార్యదర్శుల ద్వారా గర్భిణులు, బాలింతలు, విద్యార్థులకు పంపిణీ చేసినట్లు వివరించారు.

సుజాతనగర్: మండలంలో సింగభూపాలెం, సీతంపేట సెక్టార్లలో 51 కేంద్రాలు ఉన్నాయి. వీటిలో ఒకటి మినహా మిగిలిన అన్ని కేంద్రాలలోని మెయిన్, మినీ టీచర్లు ఆయాలతో కలిపి 80 మంది సమ్మెలో పాల్గొంటున్నారు. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆయా కేంద్రాలకు వేసిన తాళాలను సూపర్‌వైజర్లు శనివారం పగులగొట్టి గుడ్లను గర్భిణులు, బాలింతలకు అందజేశారు. సూపర్‌వైజర్లు రమాదేవి, సుధతి పాల్గొన్నారు.

రైతులకు ఉచితంగా ఎద్దులు, దూడలు పంపిణీ

పాల్వంచ: సేంద్రియ వ్యవసాయం ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో రైతుకు రెండు ఎద్దులు, కోడె దూడలను ఆదివారం ఉచితంగా అందించడం జరుగుతుందని పాల్వంచ అన్నపూర్ణ గోసంరక్షణ సమితి ప్రధాన కార్యదర్శి ఆంజనేయ శర్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు తమ నివాస ధృవీకరణ పత్రంతో పాటు ఎద్దులు, కోడెదూడలను సొంత వ్యవసాయానికి వాడుకుంటామని అగ్రిమెంట్ చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఈ ఎద్దులు, కోడెదూడలు పొట్టివి చింతూరు, ఒడిషా రాష్ట్రానికి చెందినవని తెలిపారు.

బిల్లులు ఆమోదించండి

కొత్తగూడెంఅర్బన్: బీసీల రిజర్వేషన్, మహిళా రిజర్వేషన్ బిల్లును వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో ఆమోదించాలని కోరుతూ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో శనివారం కొత్తగూడెంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కేంద్రప్రభుత్వం బీసీ, మహిళా రిజర్వేషన్ బిల్లులపై చిత్తశుద్ధి చూపాలన్నారు. రిజర్వేషన్లపై బీఆర్‌ఎస్ పార్టీ కట్టుబడి ఉందని, పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని కోరారు. గతంలో బీసీల రిజర్వేషన్, మహిళా రిజర్వేషన్ విషయమై తొమ్మిదేళ్ల తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీలో ఏకగ్రీవంగా తీర్మానం చేయడం జరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదో అర్థం కావడం లేదన్నారు. కేంద్రంలో అధికార బీజేపీ, ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ పార్టీలు ద్వంద్వ వైఖరి అవలంబిస్తున్నాయని విమర్శించారు. ఒక్కో రాష్ట్రంలో ఒక్కో తీరుగా బీజేపీ, కాంగ్రెస్ వ్యవహరిస్తున్నాయని, తెలంగాణ రాష్ట్రంలో వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ అఖండ విజయం సాధిస్తుందని, కేసీఆర్ ముఖ్యమంత్రిగా హాట్రిక్ సాధించడం ఖాయమన్నారు. కార్యక్రమంలో వనమా రాఘవేందర్‌రావు, కంచర్ల చంద్రశేఖర్‌రావు, కొత్వాల శ్రీనివాసరావు, దిండిగల రాజేందర్, కాపు సీతాలక్ష్మి, ఎంపీపీలు బాదావత్ శాంతి, భూక్యా సోనా, భూక్యా విజయలక్ష్మి, బత్తుల వీరయ్య, మండే వీరహనుమంతరావు, భూక్యా రాంబాబు తదితరులు పాల్గొన్నారు.


ర్యాలీలో ఎమ్మెల్యే వనమా తదితరులు

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనే లక్ష్యం

చుంచుపల్లి: కొత్తగూడెం నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం చుంచుపల్లి మండలం ప్రశాంతినగర్ పంచాయతీ పరిధిలో పేదలు వేసుకున్న గుడిసెల కాలనీని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వనమా కాలనీలో మొక్కలు నాటారు. మాట్లాడుతూ.. నిరంతరం ప్రజాసేవకే కృషి చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖరరావు, ఎంపీపీ బాదావత్ శాంతి పాల్గొన్నారు.

ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లాలి


మందులు అందజేస్తున్న జడ్జి భానుమతి

పాల్వంచ: బధిరులు, దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లాలని కొత్తగూడెం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి జి.భానుమతి అన్నారు. ప్రపంచ బధిరుల దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక కాంట్రాక్ట్ కాలనీలోని శాంతి చెవిటి, మూగ, మానసిక వికలాంగుల పాఠశాలలో జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ, లయన్స్ క్లబ్ ఆఫ్ కిన్నెరసాని ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. చెవిటి మిషన్లు, మందులు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. బధిరులం అనే భావనను మనసులో నుంచి తొలగించుకోవాలని, అనుకున్నది సాధించగలమనే ఆత్మస్థైర్యం పెంచుకోవాలన్నారు. ప్రభుత్వాలు, సామాజిక సేవకులు సహకారం మీకెప్పుడూ ఉంటుందన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేశ్ కుమార్, అనుబ్రోలు రాంప్రసాద్, క్లబ్ అధ్యక్షుడు కేదారేశ్వర్ రావు, రేపాక ప్రసాదరావు, ఎండీ.రంజాన్, పాండు రంగాచారి, పాఠశాల నిర్వాహకులు క్రిసోలైట్ తదితరులు పాల్గొన్నారు.

ఏడాది గడిచినా ఒప్పందం అమలేది?

ఇల్లెందు: సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు ఏడాది గడిచినా ఒప్పందం అమలు జరగడం లేదని ప్రగతిశీల కాంట్రాక్ట్ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ యాకుబ్‌షావలీ అన్నారు. శనివారం జేకే ఓసీ అడ్డా మీద జరిగిన మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. సింగరేణి ఒకే కుటుంబం.. ఒకే గమ్యం.. ఒకే లక్ష్యం.. అంటూ ప్రచారం చేసుకుంటోందన్నారు. బొగ్గు పరిశ్రమలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు 2013లో జరిగిన హైపవర్ కమిటీ వేతనాలు, కోల్ ఇండియాలో 2013 నుంచి పెరుగుతున్నాయని తెలిపారు. అక్కడి కాంట్రాక్ట్ కార్మికులకు చెల్లిస్తున్న వేతనాలకు ఇక్కడి వేతనాలకు భారీ వ్యత్యాసం ఉందన్నారు. తక్షణం సింగరేణిలోనూ అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మేకల శ్రీను, చారీ, తరుణ్, లింగమూర్తి, జగదీష్, శ్రీనివాస్, బాబుసింగ్, కిరణ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ విజయభేరి సభను జయప్రదం చేయండి

జూలూరుపాడు: 17వ తేదీ రంగారెడ్డి జిల్లా తుక్కుగూడలో జరగనున్న కాంగ్రెస్ విజయభేరి సభను జయప్రదం చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు లేళ్ల వెంకటరెడ్డి, మండల అధ్యక్షుడు మాళోత్ మంగీలాల్ నాయక్‌లు పిలుపునిచ్చారు. శనివారం జూలూరుపాడులో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ విజయభేరి సభకు కాంగ్రెస్ శ్రేణులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ సభకు ఏఐసీసీ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేలు హాజరవుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో దుద్దుకూరి మధుసూదన్‌రావు, నర్వనేని పుల్లారావు, సాయిల కృష్ణయ్య, మర్రి నరసింహారావు, వాంకుడోత్ కిషన్ నాయక్, కొమ్మినేని రాంబాబు, బానోత్ వెంకటేష్, బానోత్ మంగూ నాయక్, భూక్యా అనిల్, గుగులోత్ బాసి, తదితరులు పాల్గొన్నారు.


జూలూరుపాడు: మాట్లాడుతున్న నాయకులు

కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ముస్లింలకు 12 శాతం రిజర్వేషన్...

కొత్తగూడెంరూరల్: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ముస్లింలకు 12శాతం రిజర్వేషన్ అమలు చేస్తామని డీసీసీ మైనార్టీ జిల్లా అధ్యక్షుడు మహిముద్‌ఖాన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని విద్యానగర్ కాలనీలోని పార్టీ కార్యాలయంలో జిల్లా మైనార్టీ ఉపాధ్యక్షుడు మొహమ్మద్ కరీమ్‌పాషా అధ్యక్షతన నియోజకవర్గ కాంగ్రెస్ మైనార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం శనివారం జరిగింది. మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం మాయమాటలు చెప్పి ఓట్లు దండుకుంటోంది తప్ప ముస్లింలకు ఎలాంటి లబ్ధి చేయలేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ముస్లింలకు 12శాతం రిజర్వేషన్‌తోపాటు అర్హులందరికి ఇళ్లు, ఇంటి స్థలాలు మంజూరు చేస్తామన్నారు. సమావేశంలో ఎస్‌కే.జానీపాషా, ఎస్‌కే.అజ్జుపాషా, ఎస్‌కే.దస్తగిరి, పటాన్, గౌరే బాబా, షాబీర్‌ఖాన్, మౌలానా రహిం, జానీ, కయ్యూం, ఖమర్, అమీర్, ఇస్మాయిల్, గౌస్‌ఖాన్, అయూబ్, ఉస్మాన్, గౌసుద్దీన్, జావిద్ తదితరులు పాల్గొన్నారు.


యాజమాన్య హక్కులు కల్పించాలి


కొత్తగూడెంఅర్బన్: ఒకే మున్సిపాలిటీలో రెండు చట్టాలు అమలు చేయడం ఎంతవరకు సమంజసమని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. శనివారం పార్టీ శ్రేణులతో కలిసి నాగయ్యగడ్డలో పర్యటించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మాట్లాడుతూ.. కొత్తగూడెం మున్సిపాలిటీలో 36 వార్డులకు ఎన్నికలు నిర్వహిస్తున్నపుడు 29 వార్డులు మినహాయించి కేవలం 7 వార్డులకు మాత్రమే ఏజెన్సీ నిబంధనలు ఎలా వర్తిస్తాయని ప్రశ్నించారు. రెండుసార్లు రామవరం ప్రాంతం నుంచి చైర్‌పర్సన్‌గా ఎన్నికైన ఈ ప్రాంత ప్రజలకు యాజమాన్య హక్కులు కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. రామవరం, పరిసర ప్రాంతాల ప్రజలకు యాజమాన్య హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గంధం మల్లికార్జున్‌రావు, సాయి, చెనిగారపు నిరంజన్‌కుమార్, అల్లకొండ శరత్, వంగా రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

క్షౌర వృత్తి సంక్షేమానికి కృషి చేయండి

వృత్తిని నమ్ముకుని జీవిస్తున్న నాయీ బ్రాహ్మణులను ప్రభుత్వం ఆదుకోవాలని సంఘం నాయకులు కోరారు. ప్రపంచవ క్షౌర వృత్తిదారుల దినోత్సవాన్ని శనివారం సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ర్యాలీ నిర్వహించి, సంఘం జెండావిష్కరణ చేశారు. పలువురు నాయకులు మాట్లాడుతూ.. ప్రభుత్వం నాయీ బ్రాహ్మణులకు విద్య, ఉపాధి రంగాలలో ప్రాధాన్యం కల్పించాలన్నారు. – సాక్షి నెట్‌వర్క్


ఇల్లెందు: జెండా ఆవిష్కరిస్తున్న నేతలు


జూలూరుపాడులో జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు


కొత్తగూడెంనవభారత్: ప్రపంచ క్షౌర వృతిదారుల దినోత్సవంలో పాల్గొన్న నాయీ బ్రాహ్మణులు